ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: ప్రజా సంక్షేమమే పరమావధిగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. సూరారం డివిజన్ మార్కండేయనగర్‌కు చెందిన అకోజు శోభారాణి కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధ పడుతోంది. పేద కుటుంబ కావడంతో చికిత్స కోసం ఆమె కుమారుడు వెంకటేష్ శ్రీశైలంగౌడ్‌ను ఆశ్రయించాడు. దీనిపై స్పందించిన ఆయన రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకువెళ్లి రూ.2.5 లక్షలు శస్త్ర చికిత్స నిమిత్తం మంజూరు చేయించారు. బుధవారం షాపూర్‌నగర్‌లోని తన నివాసంలో రూ.2.5 లక్షల ఎల్‌ఓసీ పత్రాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరూ సంక్షేమ ఫలాల లబ్ధి పొందాలన్నారు.

కైసర్‌నగర్‌లో అన్నదాన కార్యక్రమం..

గాజులరామారం డివిజన్ కైసర్‌నగర్‌లో మంగళవారం రాత్రి కాంగ్రెస్ నాయకులు తౌసీఫ్, జహంగీర్, రజాక్ ల ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని శ్రీశైలంగౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుచ్చిరెడ్డి, లాయక్, మోతె శ్రీనివాస్, గుమస్తా మధుసూదన్, ఖాజా భాయ్ తదితరులు పాల్గొన్నారు.


సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్ఓసీ పత్రాన్ని అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్


కైసర్‌నగర్‌లో జరిగిన అన్నదాన కార్యక్రమానికి హాజరైన శ్రీశైలంగౌడ్

బిల్డర్‌పై చర్యలు తీసుకోండి

హెచ్ఎండీఏ టౌన్‌ప్లానింగ్ కమిషనర్ ఉత్తర్వులు జారీ

నిజాంపేట్: ఫ్లాట్స్ ఓనర్స్‌ను ఇబ్బందులకు గురిచేస్తున్న బిల్డర్‌పై తగు చర్యలు తీసుకోవాలని నిజాంపేట్ కార్పొరేషన్ అధికారులను ఆదేశిస్తూ హెచ్ఎండీఏ టౌన్‌ప్లానింగ్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. నిజాంపేట్ గ్రామంలోని సర్వే నెంబర్లు 148 నుంచి 155, 157 నుంచి 162, 167 నుంచి 171 లలో వజ్రా నిర్మాణ్ అపార్ట్‌మెంట్ పేరిట బిల్డర్ నిర్మాణాలు చేపట్టి పలువురి విక్రయాలు చేపట్టారు. అయితే సదరు బిల్డర్ ఆవరణలో ఏర్పాటు చేసిన సదుపాయాలను వినియోగించకోకుండా అడ్డుగా గోడను నిర్మించాడు. ఈ విషయమై సదరు బిల్డర్‌ను ఫ్లాట్ల యజమానులు ప్రశ్నించగా బెదిరింపులకు పాల్పడటంతో వజ్రా నిర్మాణ్ ఫ్లాట్ ఓనర్స్ కో.ఆపరేటివ్ మెయింటెనెన్స్ సొసైటీ సభ్యులు హెచ్ఎండీఏకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన హెచ్ఎండీఏ టౌన్ ప్లానింగ్ కమిషనర్ వజ్రా నిర్మాణ్ అపార్ట్‌మెంట్స్‌ను సందర్శించి బిల్డర్ నిబంధనలను అతిక్రమించినట్లు రుజువైతే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నిజాంపేట్ కార్పొరేషన్ అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు.

కార్పొరేట్ స్థాయి వైద్యసేవలను అందించడమే లక్ష్యం


ఎల్ఓజీ పత్రాలను అందజేస్తున్న కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి

నిజాంపేట్: పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యసేవలను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ డివిజన్ గణేష్‌నగర్‌కు చెందిన రవికుమార్ కుమార్తె ప్రస్తుతి కొన్ని రోజులుగా టర్నర్ సిండ్రోమ్ వ్యాధితో బాధ పడుతోంది. నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స చేయించేందకు ఆర్థిక స్తోమత లేకపోవడంతో హన్మంతరెడ్డిని ఆశ్రయించగా రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ప్రస్తుతికి రూ.2.10 లక్షల ఎల్ఓసీ మంజూరయ్యింది. అదే విధంగా భౌరంపేట్‌కు చెందిన సుజాతకు మంజూరైన రూ.2.5 లక్షల ఎల్ఓసీ పత్రాలను బుధవారం బాచుపల్లిలోని కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ బీ–బ్లాక్ అధ్యక్షుడు బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి, నిజాంపేట్ కార్పొరేషన్ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్‌రెడ్డి, నాయకులు సంజీవరెడ్డి, రాజేందర్‌రెడ్డి, గణేష్, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కోటి లింగాలను తయారు చేస్తున్న మహిళలు



కోటి శివలింగార్చనకు..

కుత్బుల్లాపూర్: పుట్ట మన్నుతో శివలింగాలను రూపొందించడంలో భక్తులు నిమగ్నమయ్యారు. కోటి లింగాలను తయారు చేసేందుకు మహిళలు సంకల్పించారు. కార్తీకమాసంలో వారణాసిలో శ్రీ కాశీ అభిముక్త మహాక్షేత్రంలో కోటి శివలింగార్చన కోసం కుత్బుల్లాపూర్ గ్రామంలోని శ్రీవేణుగోపాల స్వామి దేవాలయంలో కోటి లింగాలను తయారు చేస్తున్నారు. మహిళలు పెద్ద ఎత్తున తరలి వచ్చి లింగాలను తయారు చేస్తున్నారు. నవంబరు 4వ తేదీ నుంచి తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం గంగానదిలో నిమజ్జనం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో సరస్వతి మాత పూజ


శ్రీనిధి గ్లోబల్ స్కూల్‌లో సరస్వతి పూజ చేస్తున్న దృశ్యం

సుభాష్‌నగర్: విద్య నీడ లాంటిదని మన నుంచి ఎవరు వేరు చేయలేరని శ్రీనిధి గ్లోబల్ స్కూల్ చైర్మన్ డాక్టర్ నల్లపాటి వెంకటేశ్వరరావు అన్నారు. గాజులరామారంలోని శ్రీనిధి గ్లోబల్ స్కూల్లో బుధవారం సరస్వతి మాత పూజ నిర్వహించారు. ఇటీవల నూతనంగా చేరిన నర్సరీ విద్యార్థులకు ప్రిన్సిపల్ హైమా మధురికతో కలిసి అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్య అనేది జీవనోపాధి ఎలా కల్పించుకోవాలో, ఎలా జీవించాలో నేర్పుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరు చిన్నతనం నుండి చదువుపై దష్టి సారించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు.

విద్యార్థులు పుస్తకాలు, బ్యాగులు అందజేత

జీడిమెట్ల: పేద విద్యార్థులకు సహాయం అందించి వారు చదువుకోవడానికి సహాయ పడటం సంతోషంగా ఉందని ప్రభుత్వ ఉపాధ్యాయురాలు గుమ్మడి అనుపమ అన్నారు. ఎస్.ఆర్ నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు తండ్రి చనిపోవడంతో చదువుకు కావాల్సిన అవసరాలు తీర్చేవారు లేరు. ఈ విషయాన్ని హార్ట్ టు హెల్ప్ చారిటబుల్ ట్రస్టు ద్వారా తెలుసుకున్న ఆమె బుధవారం విద్యార్థులకు బ్యాగులు, నోట్ పుస్తకాలు, కిట్స్ ఎస్.ఆర్ నాయక్‌నగర్‌లోని హార్ట్ టు హెల్ప్ కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో మూడే రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు పుస్తకాలు కిడ్స్ అందజేస్తున్న అనుపమ


అవగాహన కల్పిస్తున్న మండల వైద్యాధికారిణి వై.నిర్మల


పాల్గొన్న వైద్య సిబ్బంది

నులి పురుగుల నివారణే ధ్యేయం

- నియోజకవర్గంలో 1,42,903 మంది చిన్నారులు
- 18 సబ్ సెంటర్లు, 114 అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు
- 1 – 19ఏళ్ల వారికి ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలంటున్న వైద్యాధికారులు


ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

నేడు నులి పురుగుల నివారణ దినోత్సవం

దుండిగల్: పిల్లల్లో నులి పురుగుల నివారణ కోసం వైద్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం రెండు సార్లు విద్యార్థులకు ఉచితంగా ఆల్బెండజోల్ మాత్రలు అందిస్తుంటారు. ఇందులో భాగంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నేటి నుంచి అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వైద్య సిబ్బందికి అవగాహన సదస్సులు సైతం నిర్వహించారు. నియోజకవర్గంలో పిల్లలకు నులి పురుగుల నివారణ మందులు వేసేందుకు ఇప్పటికే 1–19 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న వివరాలను వైద్య అధికారులు సేకరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆయా సెంటర్లల్లో విద్యార్థులకు మాత్రలు వేసే విధంగా సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. వీరితో పాటు పలువురు వలంటీర్ల సేవలను వినియోగించుకోనున్నారు.

నులి పురుగుల వ్యాప్తి ఇలా..

మనిషి పేగుల నుంచి పోషకాహారాన్ని గ్రహించి అభివృద్ధి చెందే పరాన్నజీవులే నులి పురుగులు. పిల్లల్లో సాధారణంగా మూడు రకాల క్రిములైన ఏలిక పాములు, నులి పురుగులు, కొంకి పురుగులు పెరుగుతాయి. ఆరు బయట ఆడుకోవడం, చేతులు కడుక్కోకుండా ఆహారం తీసుకోవడం.. బహిరంగ ప్రదేశాల్లో మలమూత్ర విసర్జన, అపరిశుభ్ర పరిసరాలతో నులి పురుగులు సంక్రమిస్తాయి. దీని ద్వారా పిల్లల్లో రక్తహీనత, అతిసారం, పోషకాహార లోపం, ఆకలి మందగించడం, బలహీనత, ఆందోళన, కడుపు నొప్పి, వికారం, విరోచనాలు, బరువు తగ్గడం వంటివి చోటు చేసుకుంటాయి.

కుత్బుల్లాపూర్‌లో విద్యార్థుల వివరాలు..

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఒకటి నుంచి 19 సంవత్సరాల లోపు మొత్తం 1,42,903 మంది ఉన్నట్లు గుర్తించారు. నియోజకవర్గంలో మొత్తం 18 సబ్ సెంటర్లు, 114 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 1–5 సంవత్సరాల లోపు పిల్లలు 7,549 చిన్నారులు ఉన్నారు. స్కూల్‌కు వెళ్లని విద్యార్థులు 1,562 ఉండగా ప్రైవేటు స్కూళ్ల విద్యార్థుల సంఖ్య 99,460 ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు, ఆయాలు, ఆశా వర్కర్లు, సిబ్బంది పిల్లలకు ఈ మాత్రలను వేయనున్నారు.

మాత్రలు తప్పకుండా వేయించాలి



పిల్లల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలి. నులి పురుగుల వల్ల పిల్లలు అనారోగ్యం బారిన పడుతున్నారు. వాటిని నివారించి ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేలా తల్లిదండ్రులు, పాఠశాలల యాజమాన్యాలు సహకరించాలి. ఇప్పటికే పాఠశాలల యాజమాన్యాలతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాం. రానున్న వర్షాకాలం నేపథ్యంలో నులి పురుగులు సంక్రమించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ముందస్తుగా వాటిని నివారిస్తే పిల్లలు ఆరోగ్యంగా ఎదుగుతారు.


– వై.నిర్మల, మండల వైద్యాధికారిణి

మన్నె రాజుకు సత్కారం



సుభాష్‌నగర్: ముదిరాజు కులస్తుల అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని మేడ్చల్ జిల్లా ఫిషరీష్ కో–ఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు అన్నారు. మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కో ఆపరేటివ్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా పోల్కం విగ్నేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో బుధవారం మన్నె రాజును ముదిరాజ్ కులస్తులు శాలువతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా మన్నె రాజు మాట్లాడుతూ.. ఆర్థికంగా వెనుకబడ్డ ముదిరాజ్ బంధువులందరికీ చేయూతను అందిస్తానన్నారు. అందరిని కలుపుకొని ముందుకు వెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో శీను ముదిరాజ్, తోడేటి సత్యంముదిరాజ్, అశోక్ ముదిరాజ్, భానుప్రకాష్ ముదిరాజ్, దేవరాజ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం


శ్రీదేవి (ఫైల్)

జగద్గిరిగుట్ట: ఓ మహిళ అదృశ్యమైన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్ట పాపిరెడ్డినగర్ బ్లాక్–ఏలో నివాసముండే సుబ్బారావు, శ్రీదేవి(50) భార్యాభర్తలు. కాగా బుధవారం ఉదయం 9.30 గంటల ప్రాంతంలో ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లిన శ్రీదేవి సాయంత్రమైనా ఇంటికి చేరుకోలేదు. ఆమె మొబైల్‌కు ప్రయత్నిస్తే స్విచ్ఛాప్ రావడంతో ఆందోళన చెందిన కుటుంబీకులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. భర్త సుబ్బారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

స్పందించారు.. పనులు చేపట్టారు



జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని రాజీవ్‌గృహకల్పలో వారం రోజులుగా పొంగిపొర్లుతున్న డ్రైనేజీ సమస్యలపై బుధవారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన కార్పొరేటర్ జగన్, వాటర్ వర్క్స్ మేనేజర్ ఝాన్సీ బుధవారం ఆ ప్రాంతాన్ని సందర్శించారు. వెంటను డ్రైనేజీ పనులు చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

బడ్జెట్ పాఠశాలలను దెబ్బతీయడమే వారి లక్ష్యం

- ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు
- సుచిత్రలోని శ్రీచైతన్య పాఠశాల ఎదుట ధర్నా


సుచిత్రలోని శ్రీచైతన్య పాఠశాల ముందు ధర్నాకు దిగిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు..


నిరసన కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు..

కుత్బుల్లాపూర్: నైతిక విలువలు పాటించని, సామాజిక విలువలు తెలియని శ్రీచైతన్య పాఠశాలను మూసివేయాలని తెలంగాణ ప్రైవేట్ పాఠశాలల రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్ అన్నారు. అనుమతులు లేకుండా విద్యార్థులను చేర్చుకుని ప్రారంభోత్సవం చేస్తున్నారని ఆరోపిస్తూ బుధవారం సుచిత్రలోని శ్రీచైతన్య టెక్నో స్కూల్ ఎదుట ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ధర్నా నిర్వహించాయి. ఈ సందర్భంగా ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ సెక్రటరీ ఎస్ఎన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వ గుర్తింపు తీసుకుకోకుండా 300 మంది విద్యార్థులను చేర్చుకుని శ్రీచైతన్య యాజమాన్యం వారి జీవితాలతో చెలగాటం ఆడుతోందన్నారు. అనుమతులు తీసుకోకుండా విద్యార్థులను ఎలా చేర్చుకుంటారని ప్రశ్నించారు. స్థానికంగా 40 బడ్జెట్ పాఠశాలలను దెబ్బతీయడమే లక్ష్యంగా శ్రీచైతన్య యాజమాన్యం అనుమతులు లేని పాఠశాలను ఏర్పాటు చేస్తోందని ఆరోపించారు. నేడు విద్యావ్యవస్థ కార్పొరేట్ శక్తుల చేతుల్లో కీలుబొమ్మగా మారిందని, రాష్ట్ర ప్రభుత్వం సత్వరమే స్పందించి శ్రీచైతన్య యజమాన్యం ఆగడాలపై సమగ్ర విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలన్నారు. స్థానికంగా పేద విద్యార్థులకు అందుబాటులో విద్యనందిస్తున్న పలు పాఠశాలల ఉనికి ప్రమాదంలో పడే ఆస్కారముందన్నారు. కుతుల్లాపూర్ మండల అధ్యక్షుడు మహేష్, సెక్రటరీ రవి, మాజీ అధ్యక్షుడు వర ప్రసాద్, ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు శ్రీనివాస గౌడ్, చింతల మల్లేష్, గోవర్ధన్ తదితరులు ధర్నాలో పాల్గొన్నారు. అనంతరం తెలంగాణ సెక్రటేరియట్‌లోని పాఠశాల ప్రిన్సిపాల్ సెక్రటరీ బుర్ర వెంకటేష్‌కు వినతి పత్రం అందజేశారు.

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న మహిళా నాయకులు

సుభాష్‌నగర్: మాజీ ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు బుధవారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కుత్బుల్లాపూర్ బి.బ్లాక్ మహిళా అధ్యక్షురాలు సొంటిరెడ్డి చైతన్య చిత్తారమ్మ ఆలయంలో వేడకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా మహిళా అధ్యక్షురాలు ఆర్.లక్ష్మి హాజరై కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేశారు. రాబోయే రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు రాహుల్ గాంధీ పొందాలని మహిళా కాంగ్రెస్ సభ్యులు అభిలాషించారు.

సామాజిక శాస్త్రాల వైపు సైన్స్ విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: మారుతున్న పరిస్థితులకు అనుకూలంగా వివిధ కోర్సుల్లో చదివేందుకు విద్యార్థులకు అవకాశాలు కల్పిస్తున్నారు. బీఎస్సీ విద్యార్థులు ఎంఏ కోర్సులు, బీఏ వాళ్లకు ఎంకాం, ఇంజినీరింగ్, మెడికోలకు పీజీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నారు. గతంలో పీజీ కోర్సులు చదవాలంటే డిగ్రీలో తప్పని సరిగా సంబంధిత సబ్జెక్టును చదవాల్సి ఉండేది. రెండేళ్ల క్రితం ఈ నిబంధనను సడలించారు. డిగ్రీతో సంబంధం లేకుండా ఎంఏ, ఎంకాం కోర్సు ల్లో ప్రవేశాలకు అందరికి అవకాశం కల్పించారు. దీంతో సైన్స్ విద్యార్థులు సామాజిక శాస్త్రాలను చదివేందుకు ఆసక్తిని చూపుతున్నారు. మెడిసిన్, ఇంజినీరింగ్ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు వివిధ ఎంఏ, ఎంకాం కోర్సుల్లో ప్రవేశాలకు అర్హులని టీఎస్ సీపీజీఈటీ–2024 కన్వీనర్ ప్రొ. పాండురంగా రెడ్డి తెలిపారు. టీఎస్ సీపీజీఈటీ–2024లో వివిధ సామాజిక శాస్త్రాలకు దరఖాస్తు చేసుకున్న బీఎస్సీ అభ్యర్థుల సంఖ్య ఈ విధంగా ఉంది. ఎంఏ పొలిటికల్ సైన్స్‌కు 375 దరఖాస్తులు రాగా సోషియలజీ–333, చరిత్ర–285, సైకాలజీ–172, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్–95, ఎకనామిక్స్–66, ఎంకాం–34 కాగా బీఏ పూర్తి చేసిన 40 మంది విద్యార్థులు ఎంకాం కోర్సులో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేయని అభ్యర్థులు రూ.500 ఫైన్‌తో ఈ నెల 25 వరకు రూ.2వేల ఫైన్‌తో 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.

అస్తవ్యస్థం.. యూజీడీ నిర్మాణం


ఔట్‌లెట్ సరిగా లేక పైకి వచ్చిన మురుగు

జీడిమెట్ల: అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం అస్తవ్యస్థంగా నిర్మాణం చేయడం పట్ల ఎస్ఆర్‌నగర్ కాలనీ ప్రజలు కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సుభాష్‌నగర్ డివిజన్ ఎస్ఆర్‌నాయక్‌నగర్‌లో గత 15రోజుల క్రితం మున్సిపల్ కాంట్రాక్టర్ కాలనీలో 300 మీటర్ల మేర యూజీడీ నిర్మాణం చేశాడు. అనంతరం కాంట్రాక్టర్ మట్టిని సరిగా పూడ్చకుండా రోడ్డుపై అలానే వదిలేశాడు. నిర్మాణంలో సైతం కాంట్రాక్టర్ నాసిరకంగా నిర్మించడంతో పాటు పైప్‌లైన్ లెవెల్‌గా వేయకపోవడం వలన మురుగు పైకి వస్తుంది. దీంతో కాలనీలో తీవ్రమైన దుర్వాసన వస్తుందని కాలనీ ప్రజలు అంటున్నారు. నాసిరకమైన పనులు చేసిన కాంట్రాక్టర్‌పై అధికారులు చర్యలు తీసుకోవాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.

రేపు ఉచిత యోగా శిబిరం

సుభాష్‌నగర్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని సుచిత్ర చౌరస్తాలో ఉచిత యోగా శిబిరం నిర్వహిస్తున్నట్లు కె.రవీందర్ రాజు అన్నారు. శివోహం యోగా రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 5.45 నుంచి 7.15 వరకు ఈ ఉచిత యోగా శిబిరం ఉంటుందని పేర్కొన్నారు. చిన్న పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఈ శిబిరంలో పాల్గొని ఆరోగ్య మార్గంలో నడవాలన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నం.93963 78418.

బాలానగర్ డీసీపీగా సురేష్‌కుమార్ బాధ్యతలు



జీడిమెట్ల: బాలానగర్ డీసీపీగా కె.సురేష్‌కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న టి.శ్రీనివాసరావు బదిలీపై జోగుళాంబ గద్వాల జిల్లా ఎస్పీగా బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో కొమురంభీం అసిఫాబాద్ జిల్లా ఎస్పీగా పనిచేసిన సురేష్‌కుమార్ బదిలీపై బాలానగర్ డీసీపీగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతి భద్రతలను కాపాడేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు.

విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2009లో కేంద్రం రూపొందించిన విద్యా హక్కుల చట్టం ప్రకారం ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత ప్రవేశాలు కల్పించాలని వివరించారు. కానీ విద్యా వ్యవస్థలోకి రాజకీయ నాయకులు ప్రవేశించడంతో విద్యా రంగం భ్రష్టు పట్టిందన్నారు. విద్యా హక్కు చట్టాన్ని అమలు పరుస్తూ ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్, రాజేందర్, నరసింహ నాయక్, మహేష్ పాల్గొన్నారు.

ప్రొ.మోహన్‌సింగ్ సేవలు మరువలేనివి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీ మాజీ ప్రిన్సిపల్ దివంగత అధ్యాపకులు ప్రొ.మోహన్ సింగ్ విద్యార్థులకు చేసిన సేవలను మరువలేనివని పలువురు వక్తలు కొనియాడారు. బుధవారం ఆర్ట్స్ కాలేజీ 57వ తరగతి గదిలో జరిగిన ప్రొ.మోహన్‌సింగ్ ప్రథమ వర్ధంతి సభలో డాక్టర్ మోహన్‌సింగ్ వ్యక్తిత్వం, రచనలపై చర్చ జరిగింది. కార్యక్రమానికి ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొ.లింబాద్రి, మాజీ వీసీ ప్రొ.సాయన్న, డాక్టర్ అజయ్, బ్రిజేష్, స్వప్న, బండి రాజు తదితరులు పాల్గొని ప్రసంగించారు.


కేంద్ర మంత్రుల స్వాగత ఏర్పాట్లపై సమావేశం

సనత్‌నగర్: కేంద్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్ నగరానికి రానున్న సందర్భంగా బేగంపేట ఎయిర్‌పోర్ట్‌లో ఘన స్వాగతం పలికేందుకు బీజేపీ శ్రేణులు సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే కరీంనగర్ పర్యటనలో ఉన్న బండి సంజయ్ గురువారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో బేగంపేట ఎయిర్‌పోర్ట్‌కు రానున్నారు. 4 గంటల సమయంలో కిషన్‌రెడ్డి కూడా వస్తున్నారు. బుధవారం సాయంత్రం మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శులు దుగ్యాల ప్రదీప్‌కుమార్, కాసం వెంకటేశ్వర్లు, ప్రేమేందర్‌రెడ్డి, సెంట్రల్ జిల్లా అధ్యక్షులు గౌతమ్, మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్‌లు ఎయిర్‌పోర్ట్‌లో స్వాగత ఏర్పాట్లను పరిశీలించారు.

నేడు ఏఐసీఎఫ్ 28వ వార్షికోత్సవం

రాంగోపాల్‌పేట్: ఈ నెల 20వ తేదీన గోల్కొండ క్రాస్ రోడ్‌లోని మెనోనైట్ బ్రదరన్ బేతేల్ చర్చిలో ఆల్ ఇండియా క్రిష్టియన్ ఫెడరేషన్ (ఏఐసీఎఫ్) 28వ వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు సంస్థ జాతీయ అధ్యక్షులు గద్దపాటి విజయరాజు తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే వేడుకలకు పంచాయితీ రాజ్ శాఖ మంత్రి సీతక్కతో పాటు మాజీ శాసన సభ్యులు సంపత్‌కుమార్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం, రాష్ట్ర క్రిష్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్, రాష్ట్ర మైనార్టీ కమిషన్ వైస్ చైర్మన్ శంకర్ లూక్ హాజరవుతారన్నారు.

60 కిలోల గంజాయి స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జావేద్

సికింద్రాబాద్: ఒడిశా నుంచి ఢిల్లీకి గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న ముఠాను పట్టుకున్న సికింద్రాబాద్ రైల్వే పోలీసులు నిందితులను బుధవారం రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి 15 లక్షల విలువ చేసే 60 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జీఆర్‌పీ డీఎస్పీ ఎస్ఎన్ జావేద్, జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్లు సాయీశ్వర్‌గౌడ్, సరస్వత్ కథనం ప్రకారం..జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ పోలీసులు సంయుక్తంగా ప్లాట్‌ఫామ్‌లు, రైళ్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఉదయం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ 2వ ప్లాట్‌ఫామ్‌కు చేరుకున్న విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలు జనరల్ బోగీలో తనిఖీలు నిర్వహించారు. ఇందులో అనుమానాస్పదంగా కనిపించిన రెండు ట్రాలీ బ్యాగులను పోలీసులు అనిఖీ చేశారు. అందులోంచి గంజాయి ప్యాకెట్లు బయట పడ్డాయి. బ్యాగులను విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలులో నగరానికి తరలించిన అస్సాం రాష్ట్రం గజపతి జిల్లాకు చెందిన దిలీప్‌కుమార్ (34) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఆదే కేసులో గంజాయిని విక్రయించిన ఒడిశాకు చెందిన తపన్, ఢిల్లీలో వ్యాపారం చేసేందుకు దిగుమతి చేసుకునే ప్రయత్నం చేసిన బిజయ్‌లను నిందితులుగా చేర్చి వారికోసం గాలింపు చర్యలు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.